"మధురమైన ప్రియమైన పిల్లలూ - తండ్రి మీ కొరకు స్వర్గమనే కొత్త ప్రపంచాన్ని స్థాపన చేయడానికి వచ్చారు, అందుకే ఈ నరకముపై మనసు పెట్టుకోకండి, దీనిని మరచిపోతూ వెళ్ళండి"

ప్రశ్న:- దయార్ద్ర హృదయుడైన తండ్రి పిల్లలైన మీపై ఏ రూపములో ఏ దయను చూపిస్తారు?

జవాబు:- బాబా అంటారు - నేను తండ్రి రూపములో మధురమైన సాక్కిరిన్ గా అయి పిల్లలైన మీకు ఎంతటి ప్రేమనిస్తానంటే, దానిని మీకు ప్రపంచంలో ఇంకెవరూ ఇవ్వలేరు. నేను మిమ్మల్ని పవిత్ర ప్రేమతో కూడిన ప్రపంచానికి యజమానులుగా తయారుచేస్తాను. టీచర్ గా అయి మీకు ఎటువంటి చదువును చదివిస్తానంటే, దాని ద్వారా మీరు స్వర్గములోని మహారాణిగా అవుతారు. ఇది మనుష్యుల నుండి దేవతలుగా తయారయ్యే చదువు. ఈ జ్ఞాన రత్నాలు మిమ్మల్ని విశ్వాధిపతులుగా చేస్తాయి.

పాట:- తల్లి ఎవరు, తండ్రి ఎవరు... (కౌన్ హై మాతా, కౌన్ హై పితా...)

ఓం శాంతి. పిల్లలకు ఓం శాంతి అర్థాన్ని వివరించడం జరుగుతుంది. ఓం అంటే అర్థము - నేను ఒక ఆత్మను, ఆత్మనైన నేను నిరాకార పరమాత్ముని సంతానాన్ని. ఎవరైతే జన్మనిచ్చారో, వారు శారీరక తండ్రి, వారిని శరీరానికి జన్మనిచ్చే తండ్రి అని అంటారు మరియు శివబాబా ఆత్మలకు తండ్రి. వారైతే ఎల్లప్పుడూ ఉన్నారు. లెక్కలేనన్ని కోట్లాది మంది ఆత్మలు తమ నిరాకార ప్రపంచములో ఉంటారు. అక్కడ ఎల్లప్పుడూ నిర్వికారులుగానే ఉంటారు, వికారులు పరంధామంలో ఉండరు. మొట్టమొదట ఈ విషయాన్ని పక్కా చేసుకోవాలి - నేను ఆత్మను, నా తండ్రి పరమాత్మ. ఆత్మ సంబంధములో అందరూ సోదరులే. ఈ శారీరక తండ్రిని లౌకిక తండ్రి అని అంటారు. ఆత్మిక తండ్రిని పారలౌకిక తండ్రి అని అంటారు. వారు అందరికీ ఒక్కరే. "ఓ గాడ్ ఫాదర్, ఓ పతిత-పావనా, దయార్ద్ర హృదయుడా" - అని పిలుస్తారు కూడా కదా. ఈ విధంగా ఆత్మయే తండ్రిని పిలిచింది. ఆత్మ ఈ శరీరముతో దుఃఖితముగా ఉంది. తర్వాత సత్యయుగములో ఆత్మకు శరీరముతోపాటు సుఖము ఉంటుంది, అందుకే దాని పేరే సుఖధామము, స్వర్గము. ఇది నరకము. దుఃఖములో అందరూ స్మరిస్తారు... అని అంటూ ఉంటారు కూడా. పతిత-పావనుడిని స్మృతి చేస్తారు. పతిత-పావనుడైన తండ్రి పైన పరంధామంలో ఉంటారు అని భావిస్తారు. గంగను పతిత-పావని అని అనరు. గంగనైతే ఈ కనుల ద్వారా చూడడం జరుగుతుంది. నిరాకార తండ్రిని లేక ఆత్మను అలా చూడలేరు. పరమపిత పరమాత్మ ప్రాణదాత, వారు దివ్య చక్షు విధాత, వారిని ఓ గాడ్ ఫాదర్, క్రియేటర్ అని అంటారు. అచ్ఛా, మరి తల్లి ఎక్కడి నుండి వచ్చినట్లు? తల్లి లేకుండా తండ్రి సృష్టిని ఎలా రచించగలరు? తల్లి అయితే తప్పకుండా కావాలి కదా. గాడ్ ఫాదర్ మనుష్య సృష్టికి రచయిత, వారు అందరికీ తండ్రి. తండ్రి ఉన్నట్లయితే మరి తల్లి కూడా తప్పకుండా ఉంటారు. తండ్రి వచ్చి అర్థం చేయిస్తారు - నేను ఉన్నదే నిరాకారుడిని. నేను ఎప్పుడైతే వస్తానో, వివాహం చేసుకుంటానో, అప్పుడే పిల్లలు జన్మిస్తారు. కానీ అలా వివాహం చేసుకొనేది లేదు. వివాహము లేకుండా పిల్లలకు జన్మనివ్వాలి. పిల్లలను నేను దత్తత తీసుకుంటాను. ఒకవేళ ఎవరికైనా భార్య లేకపోతే, తమ ఆస్తిని ఎవరికైనా ఇచ్చి వెళ్ళాలనుకుంటే, పిల్లలను దత్తత తీసుకుంటారు, అప్పుడు అతనే తల్లీ, తండ్రీ అవుతారు కదా. అలా అనంతమైన తండ్రి అంటున్నారు - నేను కూడా తండ్రినే, నేను ఎలా రచిస్తాను? ఇది అర్థం చేసుకోవలసిన విషయం కదా. తండ్రి స్వయంగా వచ్చి అర్థం చేయిస్తున్నారు - నాకు శరీరమైతే కావాలి కదా. కావున వీరి శరీరాన్ని ఆధారముగా తీసుకుంటాను. మేము ఈశ్వరుని సంతానము అని మీరు అంటారు. అందరూ ఈశ్వరుని సంతానమే కానీ ఈ సమయంలో తండ్రి సమ్ముఖముగా వచ్చి ఉన్నారు. పిల్లలైన మిమ్మల్ని తమ ఒడిలోకి తీసుకుంటారు. మేము బాబా పిల్లలుగా అయ్యాము అని మీరు భావిస్తారు. తండ్రి స్వర్గ రచయిత. స్వర్గానికి యజమానులుగా తయారుచేసేందుకు రాజయోగాన్ని నేర్పిస్తారు. నేను నిరాకార గాడ్ ఫాదర్ ను అని వారు స్వయంగా కూర్చుని తెలియజేస్తారు. నిరాకారుడిని మనుష్య సృష్టికి రచయిత అని ఎలా అనగలరు? కావున పిల్లలను దత్తత తీసుకొని, వారికే కూర్చుని అర్థం చేయిస్తారు - శివుడినైన నేను నిరాకారుడిని, మీరు కూడా నిరాకారీ ఆత్మలే, మీరు గర్భ జైలులోకి వస్తారు, నేను గర్భ జైలులోకి రాను. మీ కొరకు అర్ధకల్పం గర్భ మహలు, అర్ధకల్పం గర్భ జైలు ఉంటాయి ఎందుకంటే అర్ధకల్పం మాయా రావణుడు పాపాలు చేయిస్తాడు. సత్యయుగములో పతితులుగా, దుఃఖితులుగా చేసేందుకు అక్కడ మాయ ఉండదు. నేను 21 జన్మల కొరకు మీకు స్వర్గ వారసత్వాన్ని ఇస్తాను. కొత్త ప్రపంచము అని స్వర్గాన్ని అంటారు. ఇల్లు కూడా పాతబడినప్పుడు ఆ పాత ఇంటిని వదిలి కొత్త ఇంటిలోకి వెళ్తారు. ఇది కూడా పాత ప్రపంచమే కదా. అది కొత్త ప్రపంచము, స్వర్ణ యుగము,

పావన ప్రపంచము. కావున తండ్రి అంటారు - ప్రియమైన పిల్లలూ, నేను మీ కోసం స్వర్గాన్ని స్థాపన చేస్తున్నాను, మరి మీరు నరకముతో మనస్సు ఎందుకు జోడిస్తున్నారు? ఇప్పుడు నరకాన్ని మర్చిపోండి. తండ్రినైన నన్ను మరియు స్వర్గాన్ని స్మృతి చేయండి, పాత ప్రపంచాన్ని మర్చిపోతూ వెళ్ళండి. ఇది అనంతమైన సన్యాసము. పాత దేహ సహితముగా ఏవేటినైతే చూస్తున్నారో, వాటి పట్ల కూడా మమకారాన్ని వదిలివేయండి. మేము సర్వస్వమూ ఈశ్వరునికి ఇస్తాము అని భావించండి. ఈ శరీరము, ధనము, సంపద, పిల్లలు మొదలైనవన్నీ అంతమైపోనున్నాయి. ఇది అదే మహాభారీ, మహాభారత యుద్ధము, దీని ద్వారానే ముక్తి-జీవన్ముక్తుల గేట్లు తెరుచుకోనున్నాయి. హరి ద్వారము అని అంటారు కదా. హరి అని శ్రీకృష్ణుడిని అంటారు, అతని ద్వారము వైకుంఠము. వైకుంఠ గేట్లను తండ్రి వచ్చి తెరుస్తారు. అక్కడికి పతితులు ఎవ్వరూ వెళ్ళలేరు, అందుకే పతితుల నుండి పావనులుగా తయారుచేస్తారు, దుఃఖాల నుండి విముక్తులుగా చేస్తారు. ఇంకెవ్వరూ అలా విముక్తులుగా చేయలేరు. దుఃఖహర్త, సుఖకర్త ఒక్క తండ్రియే. తండ్రి అంటారు - నేను మీకు రాజయోగాన్ని నేర్పిస్తాను. నేను సదా కొరకు సుఖాన్ని ఇచ్చేందుకు వచ్చాను. నేను మీ కొరకు వైకుంఠాన్ని అరచేతిలో తీసుకువచ్చాను. మీరు రాజయోగాన్ని నేర్చుకొని మనుష్యుల నుండి దేవతలుగా అవుతారు. తప్పకుండా ఇవి అర్థం చేసుకోవలసిన విషయాలు అని బుద్ధి కూడా చెప్తుంది. ఇది పాత ప్రపంచమని, మళ్ళీ ఇది కొత్తగా తయారవుతుందని అర్థం చేసుకోండి. సర్వశక్తివంతుడు ఒక్క తండ్రియే, వారు తమ శక్తి ద్వారా స్వర్గానికి యజమానులుగా తయారుచేస్తారు. ఒకే రాజ్యము, సర్వశక్తివంతమైన అథారిటీతో కూడిన రాజ్యము ఉండాలి అని కోరుకుంటారు కూడా. అది సత్య, త్రేతాయుగాలలో ఉంటుంది, అక్కడ స్థిరమైన, అఖండమైన, సుఖ-శాంతమయమైన దేవీ-దేవతల రాజధాని ఉండేది, అక్కడ ఏ విఘ్నాలూ ఉండేవి కావు. దానిని అద్వైత రాజ్యము అని అంటారు. అక్కడ దుఃఖితులుగా అయ్యేందుకు ఇంకొక ధర్మమే ఉండేది కాదు. ఇప్పుడు చూడండి, క్రిస్టియన్లు ఒకే ధర్మానికి చెందినవారైనా సరే, వారి మధ్యలో కూడా పరస్పరం ఎన్నో గొడవలు జరుగుతూ ఉంటాయి ఎందుకంటే ఇది మాయ రాజ్యము. సత్యయుగములో మాయ ఉండదు. ఇప్పుడు - ఓ గాడ్ ఫాదర్, దయ చూపించండి అని అంటారు. తండ్రి అంటారు - నేను దయనైతే అందరి పైనా చూపిస్తాను, పిల్లలందరినీ పాపాల నుండి ముక్తులుగా చేస్తాను అనగా పతిత ప్రపంచము నుండి విముక్తులుగా చేస్తాను. ఆత్మలైన మిమ్మల్నందరినీ నిరాకారీ ప్రపంచములోకి తీసుకువెళ్తాను. మిగిలిన శరీరాలన్నీ భస్మమైపోతాయి. ప్రకృతి వైపరీత్యాలు జరుగుతాయి అని అంటూ ఉంటారు. వాటి గుర్తులను కూడా చూస్తున్నారు. కరువు తప్పకుండా వస్తుంది.

ఇప్పుడు తండ్రి అంటున్నారు - ఈ ఛీ-ఛీ ప్రపంచము నుండి మమకారాన్ని తొలగించివేయండి. అనంతమైన తండ్రి సాక్కిరిన్ వంటివారు. వారు అంటారు, నేను మిమ్మల్ని ప్రేమించినట్లుగా ఇంకెవ్వరూ ప్రేమించలేరు. ఇప్పుడు మిమ్మల్ని పవిత్ర ప్రపంచానికి యజమానులుగా తయారుచేస్తాను. రాజ్యము కోసం మీరు చదువుకుంటున్నారు. లక్ష్యము-ఉద్దేశ్యము బుద్ధిలో ఉన్నాయి. ఎప్పటివరకైతే ఎవరైనా కూర్చొని అర్థం చేయించరో, అప్పటివరకు కొత్తవారు ఇవేమీ అర్థం చేసుకోలేరు. ఒక వారం రోజులు కూర్చొని - మనుష్యుల నుండి దేవతలుగా అవ్వాలి అని అర్థం చేసుకోవాలి, అందుకే తండ్రిని ఇంద్రజాలికుడు అని అంటారు. జ్ఞాన రత్నాల ద్వారా మనుష్యులను దేవతలుగా తయారుచేస్తాను. వారిని రత్నాకరుడు, వ్యాపారి, యాత్రికుడు అని కూడా అంటారు. నేను వచ్చి మిమ్మల్ని స్వర్గపు మహారాజా, మహారాణులుగా తయారుచేస్తాను. ఈ యాత్రికుడు ఎంత సుందరమైనవారు! ఎందుకూ పనికిరానివారిగా ఉన్న మిమ్మల్ని ఇప్పుడు చదివించి స్వర్గానికి రాణులుగా తయారుచేస్తాను. మనం సూర్యవంశీయులుగా, చంద్రవంశీయులుగా అయ్యేందుకు చదువుకుంటున్నాము అని మీకు తెలుసు. పరమాత్మ చదివిస్తున్నారు. మీరు ఇక్కడ ఏమి చదువుకుంటారు? మనుష్యుల నుండి దేవతలుగా అయ్యేందుకు చదువుకుంటున్నాము అని మీరు అంటారు ఎందుకంటే ఈ అసురీ గుణాలతో కూడిన మనుష్య సృష్టి వినాశనమవ్వనున్నది. నిర్గుణుడినైన నాలో ఏ గుణమూ లేదు అని కూడా అంటారు. ఆ దయార్ద్ర హృదయుడైన తండ్రియే కూర్చొని మిమ్మల్ని చదివిస్తారు. అన్ని ధర్మాల వారూ ఒక్క నిరాకారుడైన తండ్రినే పరమాత్మగా భావిస్తారు. మనుష్యులు గాడ్ ఫాదర్ అని అన్నా కానీ అసలు వారు ఎవరు, ఎక్కడికి వస్తారు అన్నది వారికి తెలియదు. ఇప్పుడు మీకు తెలుసు - వారు పాత పతిత ప్రపంచములోకి వస్తారు ఎందుకంటే పావన ప్రపంచాన్ని స్థాపన చేస్తారు. పాత ప్రపంచాన్ని కొత్త ప్రపంచముగా తయారుచేస్తారు. కొత్త ప్రపంచములోనైతే సుఖమే సుఖము ఉంటుంది. బాబా అంటారు, కొత్త ప్రపంచ స్థాపన చేసేందుకు కల్ప-కల్పమూ నేను రావాల్సిందే. రాత్రి తర్వాత పగలు ఉంటుందని బుద్ధి అర్థం చేసుకుంటుంది. మళ్ళీ చక్రములో కలియుగము వస్తుంది. కలియుగము తర్వాత మళ్ళీ సత్యయుగము తప్పకుండా వస్తుంది. పిల్లలైన మిమ్మల్ని స్వదర్శన చక్రధారులు అనే అంటారు. తాను 84 జన్మలు ఎలా తీసుకుంటుంది - అని ఆత్మకు తెలుసు. మనుష్యులెవ్వరూ మనుష్యులకు సద్గతిని ఇవ్వలేరు. నేనే వచ్చి అర్థం చేయిస్తాను. నేను మిమ్మల్ని పావనంగా తయారుచేస్తాను, యోగబలముతో విశ్వంపై

విజయాన్ని పొందుతారు. తండ్రి సర్వశక్తివంతుడు. తండ్రి ద్వారా మీకు అనంతమైన వారసత్వము లభిస్తుంది. ఆకాశము, భూమి, సాగరము మొదలైనవన్నీ మీకు చెందినవిగా అయిపోతాయి. ఇక్కడ చూడండి, ఆకాశముపై కూడా హద్దులు ఉన్నాయి, అలాగే నీటిపై కూడా హద్దులను ఉన్నాయి కదా. మా నీటి సరిహద్దులలోకి మీరు రాకండి అని అంటారు. అక్కడైతే మీరు మొత్తం విశ్వమంతటి పైనా రాజ్యం చేస్తారు కదా. స్వర్గము అంటే మరి ఏమిటి! స్వర్గాన్ని మర్చిపోలేరు. మనుష్యులు మరణించినప్పుడు స్వర్గస్థులయ్యారు అని అంటారు. కానీ స్వర్గము ఎక్కడుంది? ఇది తప్పకుండా నరకమే కదా. ఇది ఉన్నదే నరకము. మనుష్యులందరూ దుఃఖితులుగా, పతితులుగా ఉన్నారు. ఇది రావణుని రాజ్యము, దీనిని కాలుస్తూ ఉంటారు కానీ ఇది కాలనే కాలదు. రావణుడిని 100 అడుగుల ఎత్తుగా తయారుచేస్తారు మరియు ఇంకా పెంచుతూనే ఉంటారు. రోజురోజుకు పెంచుతూనే ఉంటారు కానీ అర్థం చేసుకోరు. ఇవి అర్థం చేసుకోవలసిన విషయాలు.

ఇక్కడ చూడండి - మురళి వినిపించినప్పుడు అది మళ్ళీ టేపులో నింపబడుతుంది ఎందుకంటే గోపికలు మురళి లేకుండా ఉండలేరు. అందుకే ఈ ఏర్పాట్లు. మురళి లేకపోతే తపిస్తారు ఎందుకంటే ఈ మురళి జీవితాన్ని వజ్రతుల్యముగా తయారుచేసేటువంటిది. ఇక్కడ బాబా చదివిస్తారు, ఈ మురళియే లండన్, అమెరికాల వరకూ వెళ్తుంది. పిల్లలు విని ఎంతో సంతోషిస్తారు. గోపికలు మురళి లేకుండా ఉండలేరు అని అంటూ ఉంటారు. ఈ జ్ఞానాన్ని గాడ్ ఫాదర్ యే వినిపిస్తారు. ముఖ్యముగా ఒక విషయాన్ని అర్థం చేయించాలి - వీరు మన అనంతమైన తండ్రి, వీరి ద్వారా స్వర్గ వారసత్వము లభిస్తుంది. ఆత్మ అంటుంది, నా తండ్రి పరమాత్మ, వారు ఆత్మలను చదివిస్తున్నారు. నేను పరమాత్మను అని, ఆత్మలైన మిమ్మల్ని చదివిస్తున్నాను అని ఈ విధంగా ఇంకెవ్వరూ అనలేరు. అలాగే పరమాత్మనైన నేను నాలెడ్జ్ ఫుల్ అని కూడా ఎవ్వరూ అనలేరు. పిల్లలైన మీకు చాలా బాగా అర్థం చేయించడం జరుగుతుంది కానీ అందరి బుద్ధి ఏకరసముగా ఉండదు. కొందరిది సతోప్రధాన బుద్ధి, కొందరిది సతోగా, రజోగా, తమోగా... ఉంటుంది. ఇందులో టీచర్ ఏమి చేయగలరు? టీచర్ అంటారు - నీవు చదువుపై పూర్తి అటెన్షన్ ను పెట్టలేదు. గాడ్ ఫాదర్ నాలెడ్జ్ ఫుల్. ఏ విధంగా టీచర్ నాలెడ్జ్ ఫుల్ గా ఉంటారో, విద్యార్థిని చదివిస్తారో, తమ సమానముగా తయారుచేస్తారో, అలాగే ఈ సృష్టి చక్రపు జ్ఞానము గాడ్ ఫాదర్ వద్దే ఉంది, దీని గురించి ఇంకెవ్వరికీ తెలియదు. తండ్రియే జ్ఞానాన్ని నేర్పించి నాలెడ్జ్ ఫుల్ గా తయారుచేస్తారు. తండ్రి నాలెడ్జ్ ఫుల్, అందరికన్నా ఉన్నతమైనవారు. వారి పేరూ ఉన్నతమైనదే, వారి నివాస స్థానమూ ఉన్నతమైనదే. బ్రహ్మ, విష్ణు, శంకరులు సూక్ష్మవతనవాసులు. మూడవ శ్రేణిలో మనుష్యులు ఉన్నారు. మనుష్యులలో కూడా శ్రేణులు ఉన్నాయి. సత్యయుగములో మనుష్యుల శ్రేణి చాలా ఉన్నతముగా ఉంటుంది. మీరు స్వర్ణ యుగములోకి వెళ్తారు. ఇనుప యుగము అంతమైపోతుంది. స్వర్ణ యుగము ఉన్నప్పుడు వెండి యుగము ఉండదు, రాగి యుగము ఉన్నప్పుడు ఇనుప యుగము ఉండదు. ఈ విషయాలన్నింటినీ బుద్ధిలో ఉంచుకోవాలి, అందుకే చిత్రాలను తయారుచేయించారు. సత్యయుగములో చాలా కొద్దిమంది మనుష్యులు ఉంటారు. కలియుగములోనైతే లెక్కలేనంతమంది మనుష్యులు ఉన్నారు. బాబా, వినాశనం ఎప్పుడు అవుతుంది? అని అడుగుతారు. ఎప్పుడైతే నాటకము పూర్తవుతుందో, అప్పుడు వినాశనమవుతుంది, అందరూ వెళ్ళిపోతారు. బాబా ముక్తి-జీవన్ముక్తుల గైడ్. వారు పరంధామంలో ఉంటారు. మీరు కూడా అక్కడి నివాసులే, పాత్రను అభినయించేందుకు ఇక్కడకు వచ్చారు. తండ్రి అంటారు - పిల్లలూ, మీరు మాయపై విజయం పొందాలి. ఇందులో హింస యొక్క విషయమేదీ లేదు. సత్యయుగములో హింస ఉండదు. అక్కడ ఉన్నదే సంపూర్ణ నిర్వికారీ దేవీ-దేవతలు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. బుద్ధి ద్వారా అనంతమైన సన్యాసము చేయాలి. పాత దేహ సహితముగా ఏదైతే ఈ కనులకు కనిపిస్తుందో దాని నుండి మమకారాన్ని తొలగించి తండ్రిని మరియు స్వర్గాన్ని స్మృతి చేయాలి.

2. చదువును బాగా ధారణ చేసి బుద్ధిని సతోప్రధానముగా తయారుచేసుకోవాలి. మురళియే చదువు. మురళి పట్ల చాలా-చాలా శ్రద్ధ పెట్టాలి.

వరదానము:- భాగ్యము యొక్క కొత్త-కొత్త స్మృతుల ద్వారా పురుషార్థములో రమణీకతను అనుభవము చేసే మానసిక ఆరోగ్యవాన్ భవ

బ్రాహ్మణ జీవితములో, ఇది చివరి జన్మ అయిన కారణంగా శరీరం పరంగా ఎంత బలహీనంగా లేక అనారోగ్యంగా ఉన్నా కానీ, మనసు అయితే అందరిదీ ఆరోగ్యంగా ఉంది. ఉల్లాస-ఉత్సాహాలతో ఎగిరేదిగా ఉంది. శక్తిశాలి మనసుకు గుర్తు ఏమిటంటే - క్షణములో ఎక్కడికి కావాలనుకుంటే అక్కడికి చేరుకోగలగాలి. దీని కొరకు సదా మీ భాగ్యపు పాటలను పాడుతూ, ఎగురుతూ ఉండండి. అమృతవేళ నుండి భాగ్యము యొక్క కొత్త-కొత్త విషయాలను స్మృతిలోకి తీసుకురండి. ఒకసారి ఒక ప్రాప్తిని, మరొకసారి మరొక ప్రాప్తిని... ఎదురుగా ఉంచుకోండి, అప్పుడు పురుషార్థంలో రమణీకత వస్తుంది. బోర్ అనిపించదు, నవీనతను అనుభవం చేస్తారు.

స్లోగన్:- ముందు వెనుక ఆలోచించి అర్థం చేసుకుని ప్రతి కర్మను చేసినట్లయితే సఫలత ప్రాప్తిస్తూ ఉంటుంది.